## క్లుప్తంగా

### తహసీల్దార్‌గా శ్రీకన్య

సీతంపేట: సీతంపేట తహసీల్దార్‌గా డి.శ్రీకన్య ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏపీ సెక్రటేరియేట్‌లో వాటర్ రిసోర్స్ డిపార్ట్ మెంట్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈమెను ఇక్కడ నియమించారు.

### నేడు మోదీ సమక్షంలో..


కట్టోజి జనార్దనరావు, యోగా శిక్షకులు

పాలకొండ రూరల్: నేడు విశాఖలో జరగనున్న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో యోగా చేయనున్నట్టు ప్రముఖ యోగా శిక్షకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు కట్టోజి జనార్దనరావు తెలిపారు. పాలకొండ నగర పంచాయతీకి చెందిన ఈ ప్రభుత్వ ఉపాధ్యాయుడు స్థానికంగా అనేక పాఠశాలలు, ప్రభుత్వ, ప్రవేటు కార్యాలయాలతో పాటు ఋషీ యోగా కేంద్రం ద్వారా వేలాది మందికి యోగా శిక్షణ అందిస్తున్నారు. యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో వివిధ అవార్డులు పొందిన ఈయన తాజాగా కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతులు మీదుగా యోగాలో తాను చేస్తున్న కృషికి అవార్డులు పొందారు.

### సార్వత్రిక సమ్మె కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తదితరులు

సీతంపేట: వచ్చే నెల జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం ద్వారా కార్మికుల హక్కులు కేంద్రం హరిస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.లక్ష్మి, రమాదేవి, ఎస్.సంతోషి, రోయిబారి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలోని మిగులు సీట్లు భర్తీ నిమిత్తం రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), డ్రెస్ మేకింగ్ ట్రేడుల్లో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్లో జూలై 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా జూలై 17వ తేదీలోగా సమీపంలోని ఏదైనా ఐటీఐ వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు మాత్రమే జూలై 21వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతినివ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9493128352, 6304086821 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

### ఏటీడబ్ల్యూవోకు సన్మానం


సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు, హెచ్‌ఎంలు

గుమ్మలక్ష్మీపురం: బదిలీపై విశాఖపట్నం వెళ్తున్న గుమ్మలక్ష్మీపురం సహాయ గిరిజన సంక్షేమాధికారి బి.సురేష్‌కుమార్‌కు మండల పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు, డిప్యూటీ వార్డెన్లు ,ప్రధానోపాధ్యాయులు శుక్రవారం స్థానిక ఏటీడబ్ల్యూవో కార్యాలయం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా వారంతా ఆయన అందించిన సేవలపై కొనియాడారు. ఉద్యోగులకు బదిలీలు సాధారణమేనని.. బదిలీ అయిన స్థానంలో కూడా ఉత్తమ సేవలందివ్వాలని ఆకాంక్షించారు. జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బి.చంద్రశేఖర్ ఉన్నారు.

### ఫాం పాండ్స్ పనులు పూర్తి చేయండి


పోలీస్ కోటలో ఫాం పాండ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏపీఓ బాబూరావు

భామిని: మండలంలోని పోలీస్ కోట, పోలవరం గిరిజన గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో రేగిడి బాబూరావు శుక్రవారం పరిశీలించారు. వర్షాల తీవ్రత పెరుగుతున్నందున వ్యవసాయ పనులు ఆరంభానికి ముందే ఫాం పాండ్స్ పనులు పూర్తి చేయాలని ఏపీవో సూచించారు. పనుల నిర్మాణంలో పాల్గొన్న వేతనదారుల వివరాలు పరిశీలించారు. మస్తర్లు పరిశీలించారు. టీఏ, ఎఫ్ఏలు, వేతనదారులు పాల్గొన్నారు.


సీతంపేట: పదవి విరమణ చేసిన తహసీల్దార్, వీఆర్‌వోలకు సత్కరించిన రెవెన్యూ సిబ్బంది


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం


గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన రెవెన్యూ డే కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగికి సన్మానం

## ప్రజాస్వామ్య వ్యవస్థలో రెవెన్యూ కీలకం

రెవెన్యూ డే వేడుకలను తహసీల్దార్ కార్యాలయాల వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. పలు చోట్ల రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలోని పరిపాలనలో రెవెన్యూ వ్యవస్థ ఎంతో కీలకమని పేర్కొన్నారు. మనిషి తన జీవిత కాలంలో రెవెన్యూ వ్యవస్థతో అనేక సత్సంబంధాలు కలిగి ఉంటాడన్నారు. ఆయా కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో రెవెన్యూ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


భామిని: విశ్రాంత రెవెన్యూ అధికారులకు సన్మానం


వీరఘట్టం: రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది


పాలకొండ : సదస్సులో మాట్లాడుతున్న రెవెన్యూ సర్వీసుల సంఘం డివిజన్ అధ్యక్షురాలు సావిత్రి


జియ్యమ్మవలస రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే మాట్లాడుతున్న తహసీల్దార్ వై.జయలక్ష్మి


కొమరాడ: తహసీల్దార్ కార్యాలయంలో రైతులను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

## తప్పుడు ప్రచారాలపై సమగ్ర విచారణకు డిమాండ్

● ఎంఈవోలను కోరిన ఉపాధ్యాయ సంఘాలు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: ఇటీవల జరిగిన సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షలో వీరఘట్టం గాయత్రీ స్కూల్ విద్యార్థులు 8 మంది సీట్లు సాధించారని, అసత్య ప్రచారాలతో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసగిస్తూ అడ్మిషన్లు చేపడుతున్నట్టు గురువారం సాక్షిలో ప్రచురితమైన 'తప్పుడు ప్రచారాలతో విద్యార్థులకు గాలం' కథనంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పందించారు. ఈ మేరకు ఈ పాఠశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ శుక్రవారం ఎంఈవోలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావులకు ఫిర్యాదు చేశారు. కనీసం క్వాలీఫైడ్ టీచర్లు లేకుండా, కనీస మౌలిక వసతులు లేకుండా సదరు పాఠశాల నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలపై కూడా తప్పుడు ప్రచారాలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపించారు. తమ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ఇటువంటి అనేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా నదీ తీరం ప్రాంతమైన ఒట్టిగెడ్డ పక్కనే నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టారని అన్నారు. భవన నిర్మాణానికి కనీసం అనుమతులు కూడా లేవని, ఎప్పుడైన వరదలు వస్తే ఈ పాఠశాలకు వరద ముప్పు తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తప్పుడు ప్రచారాలు చేసిన గాయత్రీ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకుని, ఆ పాఠశాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మిగిలిన ప్రైవేటు పాఠశాలలపై కూడా విచారణ చేపట్టాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మజ్జి పైడిరాజు, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, బంకురు అప్పలనాయుడు, విజయభాస్కరరావు, ఎం.నరహరి, ఆర్.ధనుంజయనాయుడు, ఎ.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.


ఎంఈవోలకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


తప్పుడు ప్రచారాలతో
విద్యార్థులకు గాలం..

గురువారం సాక్షిలో వచ్చిన కథనం

**గాయిత్రీ పాఠశాల యాజమాన్యానికి నోటీసులు**

సాక్షిలో వచ్చిన కథనంతో పంచాయతీ అధికారులు కూడా స్పందించారు. ఇక్కడ ఒట్టిగెడ్డ పక్కన నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల భవనం నిర్మించారని పంచాయతీ కార్యదర్శి బొత్స కోటీశ్వరరావు అన్నారు. శుక్రవారం ఈ భవనానికి నోటీసులు అంటించామన్నారు. ఇక్కడ భవనం నిర్మించకూడదని, ఇది వరద ప్రభావిత ప్రాంతం కావున ఇక్కడ నిర్మాణాలు చేపట్టకూడదని గతంలో చెప్పామన్నారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## మిగులు సీట్ల భర్తీకి చర్యలు


ప్రిన్సిపాల్ సత్యవతి

గరుగుబిల్లి: డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి వున్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.సత్యవతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆయా తరగతులలో ప్రవేశాల కొరకు ఈ నెల 23 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. దీనికి ఈ నెల 25న ఉదయం 10 గంటలకు నెల్లిమర్లలో బాలికలకు, కొప్పెర్లలో బాలురుకు ఆఫ్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. 2025–26 విద్యాసంవత్సరం ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు హాజరై సీటురాని విద్యార్థులు ఈ నెల 22న ఉదయం 10గంటలకు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఇంటర్మీడియట్‌లో మొదటి ఏడాది ప్రవేశానికి సంబంధించి ఇప్పటికే పరీక్షకు హాజరై సీటురాని బాలికలు ఈ నెల 26న నెల్లిమర్ల గురుకులంలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 9177333885 నంబరును సంప్రదించాలన్నారు.

## ఎంఈవోగా సామల బాధ్యతల స్వీకరణ


సింహాచలంకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న బదిలీపై వెళ్లిన ఎంఈవో

గరుగుబిల్లి: మండల విద్యాశాఖాధికారిగా సామల సింహాచలం శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఎంఈవోగా పనిచేసిన దత్తి అప్పలనాయుడు డైట్ కళాశాల అధ్యాపకులుగా బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బలిజిపేట ఎంఈవోగా పనిచేస్తున్న సింహాచలంను గరుగుబిల్లి ఎంఈవో కార్యాలయానికి బదిలీ చేశారు. బాధ్యతను స్వీకరించిన సందర్భంగా సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించేలా ఉపాధ్యాయులకు ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.కొండలరావు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుల చెంతకు యోగా


గరుగుబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాలో పాల్గొన్న ఎంఈవో

గరుగుబిల్లి: సామాన్యుల చెంతకు యోగాను చేర్చడమే లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ఒ.ప్రభాకరరావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన యోగా ట్రైల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు ఆసనాలను, కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 6గంటలకు అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'భోజనం' బాగుండాలి

సీతంపేట: విద్యార్థులకు భోజనం రుచికరంగా వండాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలిచ్చారు. వేసవి సెలవుల అనంతరం ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు వచ్చారనేది అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, స్టాక్ రికార్డులు చూశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

### బాలల పరిరక్షణ అందరి బాధ్యత

జియ్యమ్మవలస రూరల్: బాలల హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యతని జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) రక్షణాధికారి ఎం.ఎ.నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన చినమేరంగి గ్రామ సచివాలయంలో బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, చైల్డ్ లేబర్ చట్టం, బాలల హక్కుల చట్టం తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

## గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

● సాదాసీదాగా ముగిసిన మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాను

పాలకొండ: గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ బి.భాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు గ్రామాల పరిధిలోని పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వ శాఖల అధికారులు వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలను చేపట్టారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులరాలు పాలవలస గౌరీ పార్వతి, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనిల్‌కుమార్, కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, ఎంపీడీవో రంగారావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## సీఆర్టీలను రెన్యువల్ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయ సీఆర్టీలను రెన్యువల్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై కొన్ని రోజులు గడుస్తున్నా ఇంత వరకూ గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలు తెరవలేదని, విద్యార్థులకు విద్యాబోధన జరగడం లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ పాఠశాలల్లో గతంలో చేసిన సీఆర్టీలను రెన్యువల్ చేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి


వరి విత్తనాలు అందజేస్తున్న గౌరీశంకరరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పంటల సాగుకు రైతులంతా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని మొండెంఖల్లు సర్పంచ్, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు ఇంటికప్పట గౌరీశంకరరావు అన్నారు. మొండెంఖల్లు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ 90 శాతం సబ్సిడీపై సమకూర్చిన వరి విత్తనాలను గిరిజన రైతులకు ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జి.విద్యారాణి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయి ప్రభ, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఐదు హెక్టార్లలో టేకు మొక్కల పెంపకం


అటవీ శాఖ కార్యాలయం వద్ద సిద్ధం చేస్తున్న టేకు స్టంపులు


గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం అటవీ శాఖ సెక్షన్ పరిధిలోని ఎస్‌కే పాడు బీట్‌లో 5 హెక్టార్లలో 12,500 టేకు మొక్కలు పెంపకానికి చర్యలు చేపడుతున్నట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయం వద్ద టేకు స్టంపులను నాటేందుకు సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ రామారావు మాట్లాడుతూ కొత్తవలస(కంటకపల్లి)లో నుంచి టేకు స్టంపులో తీసుకురావడం జరిగిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటడం జరుగుతుందన్నారు.

## ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సబ్ జైలు శాఖాధికారి

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య రక్షణకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా సబ్ జైలు శాఖాధికారి కె.మోహనరావు అన్నారు. పాలకొండ సబ్ జైల్లో వార్షిక తనిఖీలు శుక్రవారం చేపట్టారు. ఈ క్రమంలో రికార్డులు, అక్కడి పరిసరాలు, సౌకర్యాల నిర్వహణపై ఆరా తీశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతూ వారికి అందుతున్న వసతులు, సౌకర్యాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. సీజన్‌లో వ్యాధుల బారిన ఖైదీలు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పౌష్టిక విలువలతో కూడిన భోజనం, సురక్షిత నీరు అందించాలని సూపరింటెండెంట్ జోగులకు సూచించారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఖైదీలు కూడా యోగా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట జె.రామకృష్ణ, హెడ్‌వార్డర్ బి.విజయకుమార్, నరసింహులు, హేమసుందర ఏఎస్సై శ్రీనివాసరావు తదితరులున్నారు.

### ● ఆకట్టుకున్న వర్ణచిత్రం


యోగాంధ్ర కార్యక్రమం సందర్భంగా వేసిన వర్ణచిత్రం పలువురిని ఆకట్టుకొంది. మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు 21వ అంతర్జాతీయ యోగాదినోత్సం పురష్కరించుకొని సూర్య నమస్కారం చేస్తున్న సాధకుని వర్ణచిత్రం వేశారు. ఈ చిత్రం చూపరులను ఆకట్టుకుంది.

– గరుగుబిల్లి

### రోడ్డుకడ్డంగా...


పాలకొండ మండలం అట్టలి కూడలి నుంచి బుక్కూరు గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా పాడైంది. తాజా వర్షాలతో రహదారి గోతుల్లో నీరు చేరి గ్రామాలకు వెళ్లే వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై ఇటీవల సాక్షి కథనం ప్రచురితమైంది. దీంతో తాత్కాలిక పనులు చేపట్టే క్రమంలో గోతులు కప్పేందుకు వేసిన కంకర గుట్టలు రహదారి మధ్యలో వేసి వదిలేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

– పాలకొండ రూరల్